


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 05-04-2026 సంపుటి : 07 సంచిక 307 పేజీలు : 8 వెల : రూ 3-00


## రాజధాని పనులు.. వారంతా చరిత్రలో భాగస్వాములే: సీఎం చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 4: రాజధాని అమరావతి నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంప్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ స్థలంలో సుమారు 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారు. ప్రతి నిర్మాణ సంస్థ ఎంత మేరకు పనులు పూర్తి చేసింది, టార్గెట్లను ఎంతవరకు సాధించింది అనే విషయాలపై పనుల వారీగా ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కార్మికుల సంఖ్య, యంత్రాల వినియోగం వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ చేపట్టారు. వారం, నెలవారీ టార్గెట్‌లు నిర్దేశించుకుని పనులు పూర్తి చేయాలని అధికారులు, సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. వర్షాకాలం ముందు పూర్తి చేయాల్సిన పనులపై అధికారులు తమ లక్ష్యాలను సీఎంకు వివరించారు.రాజధాని నిర్మాణాన్ని కేవలం కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దని.. ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములవుతున్నట్టే అని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. 'నిర్మాణ సంస్థలుగా మీరు ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు... కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపించాల్సింది మీరే. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్ఠను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షకు మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు, రాజధాని నిర్మాణ పనులు చేపట్టిన వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయి. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన, రద్దు చేసిన పనుల సంబంధిత వివాదాలు, సమస్యలను పరిష్కరించి సీఆర్డీఏ మళ్లీ పనులను చేపట్టింది. నాటికి నేటికి నిర్మాణ వ్యయం పెరగడం వంటి సవాళ్లను అధిగమించి టెండర్లు పూర్తి చేసి పనులను అప్పగించింది సీఆర్డీఏ.

## నిర్లక్ష్యపు ధోరణి సహించను.. కాంట్రాక్టర్లపై చంద్రబాబు సీరియస్..



అమరావతి: రాజధాని అమరావతి పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరుపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి తీరాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, పలువురు అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. రాజధాని నిర్మాణానికి ఇసుక, గ్రావెల్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆజ్ఞాపించారు. ఇసుక, గ్రావెల్ కొరతతో నిర్మాణ పనుల్లో జాప్యం జరగకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు. అయితే, కృష్ణాజిల్లా అటవీ శాఖ అధికారుల వల్లే గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అటవీ అధికారులతోనే అసలు సమస్య వస్తోందన్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అటవీశాఖ అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని ఆదేశించారు. మెటీరియల్ సరఫరాలో ఎవరి ఒత్తిళ్లకూ లొంగొద్దని హుకుం జారీ చేశారు. ఎవరైనా ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపైనా సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థల తీరును తప్పుపట్టారు. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థలకు లేదా? అంటూ ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఘటన తర్వాత కూడా కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులు సరిగా స్పందించలేదని మండిపడ్డారు. ప్రతి అంశాన్నీ వక్రీకరించేలా కొందరు రాజకీయాలు చేస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి కదా? అంటూ సున్నితంగా హెచ్చరించారు.

## అమరావతి రాజధానిగా.. ఏపీ కొత్త మ్యాప్ ఇదే..

అమరావతి, ఏప్రిల్4: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర నూతన మ్యాప్‌ను విపత్తు నిర్వహణ శాఖ విడుదల చేసింది. మొత్తం 28 జిల్లాలతో కూడిన ఈ అధికారిక మ్యాప్‌ను ఈ నెల 2వ తేదీన ప్రచురించారు. ఇందులో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే.. రాజధాని అమరావతి ప్రస్తావన, కొత్తగా ఏర్పడిన జిల్లాల సరిహద్దులను స్పష్టంగా పొందుపరిచారు.ఈ నూతన మ్యాప్‌లో



రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలెట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని 'రాష్ట్ర రాజధాని' గా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. అయితే అమరావతికి ప్రత్యేక బౌండరీలను కేటాయించకుండానే, ఆ ప్రాంతాన్ని రాజధానిగా గుర్తించడం గమనార్హం. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలైట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని.. రాష్ట్ర రాజధానిగా (చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు.ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసేందుకు.. గతంలో ఉన్న 26 జిల్లాలకు అదనంగా.. ఇటీవల మార్కాపురం, పోలవరం అనే రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు జిల్లాల సరిహద్దులను కూడా తాజా మ్యాప్‌లో తెలియజేశారు. దీంతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. రాష్ట్ర విపత్తు నిర్వాహణ శాఖ ఈ మ్యాప్‌ను విడుదల చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం.. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో జిల్లాల వారీగా సహాయక చర్యలు చేపట్టడానికి స్పష్టమైన భౌగోళిక సమాచారం ఉండటమే. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత సరిహద్దుల విషయంలో ఉన్న సందిగ్ధతను ఈ మ్యాప్ తొలగించనుంది.

## ట్రంప్ నియంత్రణలో మోదీ, ఆయన నియంత్రణలో పినరయి... రాహుల్ విసుర్లు

ఇడుక్కి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో ఉన్నారని, అత్యంత అవమైనకరమైన విషయం ఏమిటంటే ట్రంప్‌ను 'సర్' అని ఆయన పిలుస్తారని చెప్పారు. మోదీ ఇంకా బ్రిటిష్ కాలంలో ఉన్నానని అనుకుంటున్నారని విమర్శించారు. మోదీని ట్రంప్ నియంత్రిస్తున్నట్టే పినరయి విజయన్‌ను మోదీ నియంత్రిస్తున్నారని అన్నారు. కేరళంలోని ఇడుక్కిలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, బీజేపీతో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఒఆఈ) కుమ్మక్కయిందని ఆరోపించారు.'బీజేపీ, ఆర్ఎస్ఎస్, లెఫ్ట్ ఫ్రంట్ మధ్య సంబంధాలను ఇవాళ ప్రతి ఒక్కరూ చూడొచ్చు. లెఫ్ట్ ఫ్రంట్‌లో సిద్ధాంతాల కోసం ఎళ్లతరబడి పనిచేసిన అవకాశవాదులు కాని కొందరు ఇప్పుడు తమను పార్టీ వంచించిందని ఆవేదన చెందుతున్నారు' అని రాహుల్ తెలిపారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌తో కుమ్మక్కయినందునే ఎల్‌డీఎఫ్ తన వామపక్ష భావజాలాన్ని కోల్పోయిం దన్నారు. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ఎప్పుడూ సైద్ధాంతిక ప్రత్యర్థిగా ఎల్‌డీఎఫ్‌తో పోరాడేదని, ఇప్పుడు ఎల్డీఎఫ్ మారిపోయిందని, ఎల్‌డీఎఫ్‌లో 'లెఫ్ట్' అనేదే లేదని, ఎన్నికల తర్వాత అందులో ఏదీ మిగలదని అన్నారు.కేరళలోని ప్రభుత్వాన్ని ఒక చీకటి శక్తి ప్రభావితం చేస్తోందని, అది రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజలపై దాడి చేస్తోందని పరోక్షంగా బీజేపీ-ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ విమర్శలు గుప్పించారు.

## మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు సంతృప్తిగా ఉన్నారు: మంత్రి కొల్లు రవీంద్ర



కృష్ణా జిల్లా, ఏప్రిల్ 4: పెనమలూరు ప్రాంతంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి కొల్లు రవీంద్రఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను సందర్శించిన మంత్రి విద్యార్థులతో మాట్లాడి టీచర్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో లావు బియ్యంతో భోజనం వడ్డించేవారని, ప్రస్తుతం సన్న బియ్యంతో మంచి భోజనం పెడుతున్నారని మంత్రికి విద్యార్థులు చెప్పారు. ఆ తర్వాత విద్యార్థులకు మంత్రి, ఎమ్మెల్యే స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు చాలా సంతృప్తిగా ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సన్న బియ్యంతో పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మంచి భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఆకుకూరలు, పప్పు కూరలు ఏ రోజు ఏమి వడ్డించాలో ఓ షెడ్యూల్ ప్రకారం భోజనం అందిస్తున్నామని అన్నారు. ప్రతిరోజు భోజనంతో పాటు ఒక గుడ్డు కూడా విద్యార్థుల ఆరోగ్యం కోసం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో దొడ్డు బియ్యం, రేషన్ బియ్యంతో భోజనం పెట్టి విద్యార్థుల ఆరోగ్యంతో ఆడుకున్నారని విమర్శించారు.డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థుల ఆరోగ్యమే ప్రధాన ఎజెండాగా భోజనాలు పెడుతున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో సుమారు 2500 పాఠశాలలకు మోడల్ కిచెన్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ పథకానికి మాత్రమే 2162 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్యూరిఫైడ్ మంచినీరు కూడా అందిస్తున్నామని చెప్పారు. మంత్రి నారా లోకేశ్ మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు కావాలని కుట్రలు చేస్తున్నాయని మంత్రి ఆరోపించారు. పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లు నిర్వహించి విద్యార్థుల స్థితిగతులను తల్లిదండ్రులకు తెలిసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో మెగా డీఎస్సీతో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేశామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.విద్యాశాఖపై మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గతంతో పోలిస్తే మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సంఖ్య 100 శాతం పెరిగిందని చెప్పారు. మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి విద్యార్థులతో భోజనం చేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. నెలలో ఒక్కసారైనా ప్రజా ప్రతినిధులు పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు.

## ఐదేళ్లు ప్రశాంతంగా జీవించాలంటే బీజేపీని ఐక్యంగా అడ్డుకోండి.. మమత పిలుపు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతాబెనర్జీ బీజేపీపై మరోసారి నిప్పులు చెరిగారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని కలిసికట్టుగా అడ్డుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. బీజేపీకి మతాలంటే గౌరవం లేదని, అంశాంతిని సృష్టించడం, మాల్దాలో స్థానికులను టార్గెట్ చేయడం, రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రం ఏజెన్సీలను దుర్వినియోగపరచడం చేస్తోందని ఆరోపించారు. పశ్చిమబెంగాల్‌లోని మానిక్‌చక్‌లో శనివారంనాడు నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో మమతా బెనర్జీ మాట్లాడారు.'రాబోయే ఐదేళ్లు మీరు ప్రశాంతంగా జీవించాలనుకుంటే బీజేపీని కలసికట్టుగా అడ్డుకోండి. దేశాన్ని బీజేపీ నాశనం చేసింది. వారికి ఏమతమన్నా గౌరవం లేదు.




# సంపాదకీయం

ఆదివారం 05-04-2026

## రాష్ట్రాల్లో చట్టంగా మారుతున్న యూసీసీ

దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర అసెంబ్లీలు యూనిఫాం సివిల్ కోడ్ బిల్లుకు వరుసగా ఇప్పుడు అది చట్టంగా మారనుంది. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అవసరంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి భిన్నమైన నిబంధనలు వర్తించకూడదు. అసలు ఒకే ఇంట్లో రెండు విధానాలు ఎలా సాధ్యం?" అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. ఒకవేళ ఒకే ఇంట్లోని కుటుంబంలో ఇద్దరు వ్యక్తులకు రెండు రకాల చట్టాలుంటే, ఆ ఇల్లు నడవదు" అని అన్నారు. చట్టం కూడా సమానత్వం గురించే మాట్లాడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మోదీ అన్నారు. ఈ బిల్లు మహిళలకు ప్రయోజనకరమని ప్రజావేదికల పైనా, మీడియాతోనూ, శాసనసభలోనూ మంత్రులు పదేపదే చెబుతున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందాక, గుజరాత్‌లో మహిళల స్థితిగతులు, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ల గురించి కూడా చర్చ మొదలైంది. ఈ బిల్లు వల్ల మహిళలకు పెద్దగా ప్రయోజనం ఉండదని, పైగా సామాజిక సమస్యలు పెరుగుతాయని కొందరు నిపుణుల అభిప్రాయం. మరోవైపు, అణగారిన వర్గాల మహిళలకు ఈ బిల్లు వల్ల మేలు జరుగుతుందని మరికొందరు అంటున్నారు. యూనిఫాం సివిల్ కోడ్ బిల్లులో మహిళల కోసం ఉన్న ముఖ్యమైన నిబంధనలు ఏమిటి, వారికి ఎలాంటి కొత్త హక్కులు కల్పించబోతున్నారు? నిపుణులు ఏమంటున్నారు? ప్రతి మహిళకు వారసత్వ ఆస్తిలో సమాన వాటా లభిస్తుంది. మతం ఆధారంగా మహిళల కోసం ఎటువంటి ప్రత్యేక నిబంధనలు ఉండవు సామాజిక సంప్రదాయాల ప్రకారం ఇచ్చే విడాకులు కాకుండా, కోర్టు ద్వారా మంజూరయ్యే విడాకులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. వివాహం ప్రతి మతంలో వారి ఆచారాల ప్రకారం చేసుకోవచ్చు, కానీ వివాహం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి. లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళను భాగస్వామి వదిలేస్తే, ఆమెకు భరణం పొందే హక్కు ఉంటుంది, వారికి పుట్టిన బిడ్డకు వారసత్వ హక్కులు లభిస్తాయి. వారసత్వ ఆస్తికి సంబంధించి ఎటువంటి వీలునామా రాయకపోతే స్థిరాస్తులు, చరాస్తులలో మహిళకు సమాన హక్కు లభిస్తుంది. ఏ మతంవారైనా సరే ఒక భార్య ఉండగా రెండో వివాహం చేసుకోకూడదనే నియమం తీసుకొచ్చారు. భర్త విడిచిపెట్టిన మహిళలకు న్యాయం చేసే అంశం కూడా ఈ బిల్లులో ఉంది. కోర్టు ద్వారానే కచ్చితంగా విడాకులు తీసుకోవాలనే నిబంధన గురించి రిటైర్డ్ జడ్జి జ్యోత్స్నా యాజ్ఞిక్ మాట్లాడారు. "యూనిఫాం సివిల్ కోడ్‌లో సామాజిక పద్ధతుల్లో ఇచ్చే విడాకులను అంగీకరించే బదులు, కోర్టు ద్వారానే విడాకులు తీసుకోవడం తప్పనిసరి చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే, ఫ్యామిలీ కోర్టులలో ఇప్పటికే విడాకుల కేసులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. అటువంటప్పుడు రాబోయే రోజుల్లో విడాకుల కేసుల భారం మరింత పెరుగుతుంది" అన్నారు యాజ్ఞిక్. "ప్రస్తుతం చాలా కులాల్లో సామాజిక పద్ధతుల్లో జరిగే విడాకులు ఇకపై చెల్లకుండా పోతాయి. దీనివల్ల ఫ్యామిలీ కోర్టుల్లో కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని కేసుల్లో తక్కువ వయసున్న అమ్మాయిలు లేదా అబ్బాయిల విడాకుల పిటిషన్లు సరైనవే అయినప్పటికీ, ఇటువంటి పరిస్థితుల్లో కేసులు సుదీర్ఘకాలం కొనసాగుతాయి. దీనివల్ల విడాకుల తర్వాత తిరిగి వివాహం చేసుకునే అవకాశం చాలామందికి తగ్గిపోతుంది" అని జ్యోత్స్నా యాజ్ఞిక్ చెప్పారు. "చాలా సమాజాలలో 'లేఖణి', 'సాటాపాటా' వంటి ఆచారాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటువంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా జరిగే విడాకుల ప్రక్రియ దుర్వినియోగమవుతున్నట్లు 2021 చివరిలో గుజరాత్ హైకోర్టులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ నానావతి ధర్మాసనం గుర్తించింది. అయినప్పటికీ, నేటికీ ఈ పద్ధతులు కొనసాగుతున్నాయి. తక్కువ చదువుకున్నవారు, ఆత్మగౌరవం కోసం విడాకులు తీసుకునే మహిళలు ఈ పద్ధతుల ద్వారా విడాకులు పొందినా స్వల్ప కాలంలోనే మరో వివాహం చేసుకోగలుగుతున్నారు. ఇప్పుడు కోర్టులలో ఇటువంటి కేసుల భారం పెరిగి, న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉంటే, కొన్ని కులాలకు చెందిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ఆమె అభిప్రాయపడ్డారు. "మహిళలకు అత్యంత ప్రమాదకరమైన నిబంధన ఏదైనా ఉందంటే, అది లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌కు గుర్తింపునివ్వడమే. ఈ సంబంధాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేశారు. గతంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారు సమాజానికి భయపడేవారు. కానీ ఇప్పుడు బహిరంగంగా, చట్టబద్ధంగా ఇటువంటి సంబంధాల్లో ఉండవచ్చు. కొత్త తరంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లకు ఈ విధంగా గుర్తింపు లభిస్తే, సమాజాన్ని ఏకంగా ఉంచే వివాహ వ్యవస్థ బలహీనపడిపోతుంది. ఇది రాబోయే రోజుల్లో ప్రమాదకరం" అని న్యాయవాది పూజా ప్రజాపతి అభిప్రాయపడ్డారు "లివ్-ఇన్ రిలేషన్‌షిప్ ద్వారా జన్మించిన బిడ్డకు కూడా హక్కులు కల్పించే అంశం ఈ చట్టంలో ఉంది. ఈ సంబంధాల వల్ల కలిగే పిల్లల విషయంలో స్త్రీ, పురుషుల మధ్య కొత్త చట్టపరమైన వివాదాలు తలెత్తుతాయి. లివ్-ఇన్‌లో ఉన్న మహిళపై ఆరోపణలు వస్తే, కొత్త గొడవలు మొదలయ్యే అవకాశం ఉంది. దీనివల్ల మహిళలకు ఎక్కువ నష్టం కలగవచ్చు. అంతేకాకుండా, 18 నుంచి 21 ఏళ్ల లోపు యువతీ యువకులు లివ్-ఇన్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలనే నిబంధన ఉంది. దీనివల్ల కొత్త సామాజిక సంఘర్షణలు మొదలవుతాయి.

## హిందీ రాష్ట్రాల విద్యార్థులు దక్షిణాది భాషలు నేర్చుకుంటారా.. : తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

న్యూ ఢిల్లీ, కేంద్ర సర్కారు పైన, సీబీఎస్ఈ పైన తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో 2026-27 విద్యా సంవత్సరం నుంచి 6వ తరగతి విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని అమలు చేయాలన్న ప్రతిపాదనపై ఆయన విమర్శలు గుప్పించారు. ఇది రాజకీయ ప్రేరేపిత చర్య అని, దేశ భాషా వైవిధ్యానికి తూట్లు పొడిచే ప్రయత్నమని మండిపడ్డారు. జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా తీసుకొచ్చిన ఈ పాలసీని తమిళనాడు మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నది. ఈ నేపథ్యంలో స్టాలిన్ మరోసారి ఘాటుగా స్పందించారు.



ఇది సాధారణ విద్యా సంస్కరణ కాదని, భారతీయ భాషలను ప్రోత్సహిస్తున్నామనే ముసుగులో హిందీని రుద్దేందుకు జరుగుతున్న ఆందోళనకర ప్రయత్నమని విమర్శించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇతర ప్రాంతీయ భాషలను పక్కనపెట్టి హిందీకి అగ్రస్థానం కల్పిస్తోందని ఆరోపించారు. భాషా విధానం పేరుతో హిందీయేతర రాష్ట్రాల్లో హిందీని విస్తరించాలని చూస్తున్నారని, దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు ఇది బలవంతంగా హిందీని నేర్పడమే తప్ప మరొకటి కాదని అన్నారు. 'హిందీ మాట్లాడే రాష్ట్రాల్లోని విద్యార్థులు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం వంటి దక్షిణాది భాషలను తప్పనిసరిగా నేర్చుకుంటారా..? అని' అని స్టాలిన్ కేంద్రాన్ని ప్రశ్నించారు. కేంద్రీయ విద్యాలయాల్లో తమిళాన్ని తప్పనిసరి చేయడంలో విఫలమైన కేంద్రం, ఇప్పుడు రాష్ట్రాలకు భాషల గురించి నీతులు చెప్పడం ద్వంద్వ నీతికి పరాకాష్ఠ అని ఎద్దేవా చేశారు. ఈ విధానాన్ని అమలు చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఆర్థిక ప్రణాళికలు ఉన్నాయా..? అని నిలదీశారు. త్రిభాషా విధానం వల్ల హిందీ మాట్లాడే విద్యార్థులకే ఉన్నత విద్య, ఉద్యోగాల్లో ప్రయోజనం చేకూరుతుందని, రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతాయని స్టాలిన్ హెచ్చరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, యానిమేషన్, గేమింగ్ వంటి ఆధునిక రంగాల్లో విద్యార్థులకు నైపుణ్యాలు అందించాల్సిన ఈ తరుణంలో, వారిపై అదనపు భాషా భారాన్ని మోపడం సరికాదని అన్నారు. రాష్ట్రాల ఆందోళనలను కేంద్రం పట్టించుకోకపోవడం సమాఖ్య స్ఫూర్తికి, కోట్ల మంది భాషా గుర్తింపునకు జరిగిన అవమానమని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

## ఆఫ్‌షోర్ చమురు క్షేత్రంలో అగ్నిప్రమాదం.. పది మందికి గాయాలు



ముంబై: ఆఫ్‌షోర్ చమురు క్షేత్రంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పది మంది గాయపడ్డారు. వారికి చికిత్స అందిస్తున్నట్లు ఓఎన్‌జీసీ అధికారులు తెలిపారు. అలాగే మంటలను అదుపుచేసినట్లు చెప్పారు. మహారాష్ట్ర రాజధాని ముంబై తీరం సమీపంలోని, అరేబియా సముద్రంలో ఉన్న, ఓఎన్‌జీసీ ముంబై హై ఆఫ్‌షోర్ చమురు క్షేత్రంలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం సాయంత్రం 5.45 గంటల సమయంలో ఎస్‌హెచ్‌పి ప్లాట్‌ఫామ్‌పై అగ్నిప్రమాదం సంభవించింది. అత్యవసర ప్రతిస్పందన బృందాలు వెంటనే స్పందించాయి. మంటలను ఆర్పివేశాయి. కాగా, ఈ అగ్ని ప్రమాదంలో పది మంది సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఓఎన్‌జీసీ తెలిపింది. ఈ సంఘటన తరువాత ఆఫ్‌షోర్ ఇన్‌స్టాలేషన్‌లో కార్యకలాపాలు సాధారణ స్థితికి వచ్చాయని ఆ సంస్థ పేర్కొంది.


## మాజీ మంత్రి జోగు రామన్న ముందస్తు అరెస్ట్




ఆదిలాబాద్ : ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా మాజీ మంత్రి, నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జోగు రామన్న ను పోలీసులు ముందస్తు అరెస్టుచేశారు. ఆదిలాబాద్‌లోని మాజీ మంత్రి ఇంటికి వెళ్లిన పోలీసులు హౌస్ అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి హోం శాఖను తన ఆధీనంలో ఉంచుకొని ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు చేయించి జైలుకు పంపడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దాహంతో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజస్వామికమని మండిపడ్డారు. ఖానాపూర్ నియోజకవర్గ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారడంతో కుట్రా పూరిత చర్యలకు దిగజారడం శోచనీయమని ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నియమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంగా జరగాల్సిన ఎన్నికలు పోలీసుల పహారా మధ్య వారికి అనుగుణంగా మార్చుకునే కుతంత్రాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

## డీఎంకేలో మేనత్త, అల్లుడి మధ్య వారసత్వ పోరు జరుగుతున్నదా..?

తమిళనాడు ,తమిళనాడు లో అధికార డీఎంకే పార్టీలో వారసత్వ పోరు కొనసాగుతున్నదా.. మేనత్త కనిమొళి మేనల్లుడు ఉదయనిధి స్టాలిన్ వారసత్వం కోసం పోటీ పడుతున్నారా.. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తనయుడు ఉదయనిధిని తన రాజకీయ వారసుడిగా నిలబెట్టాలని చూస్తున్నారా.. ఉధయనిధికి పోటీగా స్టాలిన్ సోదరి డీఎంకే వారసత్వాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారా.. అసెంబ్లీ ఎన్నికల వేళ తమిళనాడులో తాజా రాజకీయ పరిణామాలను చూస్తుంటే పై ప్రశ్నలన్నింటికీ ఔననే సమాధానం వస్తున్నది. ఇటీవల తిరునెల్వేలి జిల్లా పాళయంగోట్టయ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో డీఎంకే అభ్యర్థికి మద్దతుగా ప్రసంగించేందుకు కనిమొళి



పోడియం వద్దకు వచ్చారు. అంతే ఆమె మద్దతుదారులు ఎన్నడూ లేనంతగా పెద్దఎత్తున నినాదాలతో హోరెత్తించారు. 'కాబోయే సీఎం కనిమొళి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అభిమానుల నుంచి ఊహించని స్పందనకు ఆమె ఆశ్చర్యపోయినా.. వారిని వారించకుండా ఆమె మౌనంగా ఉండిపోయారు. దీన్ని బట్టి ఆమెకు సీఎం పదవిపై కన్ను ఉన్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంటులో చురుకైన గొంతుకగా, క్షేత్రస్థాయిలో బలమైన నాయకురాలిగా గుర్తింపు సాధించుకున్న ఆమెకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. పాళయంగోట్టయ్ ఎన్నికల ప్రచారసభలో ప్రజలు చేసిన నినాదాలే అందుకు నిదర్శనం. స్టాలిన్ తన కుమారుడికి అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో కనిమొళికి పార్టీలో ప్రాధాన్యత తగ్గిస్తున్నారనే అసంతృప్తి ఆమె వర్గంలో ఉన్నది. దక్షిణ తమిళనాడులో కనిమొళికి సమాచారం ఇవ్వకుండానే ఉదయనిధి పర్యటనలను ఖరారు చేయడం వివాదాస్పదమైంది. ప్రొటోకాల్ పాటించలేదని కనిమొళి వర్గం అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. దాంతో తిరునెల్వేలి, కోవిల్‌పట్టిలో జరగాల్సిన ఉదయనిధి స్టాలిన్ యువజన విభాగ సమావేశాలు చివరి నిమిషంలో రద్దయ్యాయని సమాచారం. ఈ క్రమంలోనే పాళయంగోట్టయ్‌లో తమ నాయకురాలి ఆదిపత్యం నిరూపించేందుకు అభిమానులు నినాదాలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

## నల్లగొండ జిల్లా జైలులో ఉచిత వైద్య శిబిరం



నీలగిరి, ఏప్రిల్ 04 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం నల్లగొండ జిల్లా కారాగారంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కారాగారం పర్యవేక్షణ అధికారి కూన ఆనందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీల ఆరోగ్య పరిరక్షణకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో ఖైదీలకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా కారాగారం జైలర్ బాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సమన్వయంతో కీలక పాత్ర పోషించారు. వైద్య శిబిరంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డా.ఏసిహెచ్ పుల్లారావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా.రమేష్, డా.సుబ్బారావు, డా.వి.వినోద్ కుమార్, డా.శంకర్, డా.విశ్వజ్యోతి, డా.రామచంద్ర, డా.జి.ప్రవీణ్, డా.భరద్వాజ్, డా.వంశీ, డా.శ్రీవాస్తవ వైద్య సేవలు నిర్వహించారు. జిల్లా జైలు మెడికల్ ఆఫీసర్ సట్టు కిరణ్ కుమార్, డిప్యూటీ జైలర్లు వెంకట్ రెడ్డి, సుబ్బరాజు, మెడికల్ సిబ్బంది సీతారామ్, లింగయ్య, అలాగే పోలీసు సిబ్బంది సైదులు, గిరిబాబు, సురేష్, రాంబాబు, కరుణాకర్, శ్రావణ్, జయప్రకాష్ రెడ్డి, గణేశ్, శ్రీకాంత్, కోటి పాల్గొన్నారు.

## ఇరాన్ ప్రకటనపై స్పందించిన డెల్.. ఉద్యోగులకు ట్రావెల్ అడ్వయిజరీ జారీ




ఇరాన్ ప్రభుత్వం తనను ఉగ్రవాద సంస్థ గా ప్రకటించడంపై అమెరికాకు చెందిన మల్టీనేషనల్ కంపెనీ డెల్ స్పందించింది. తన ఉద్యోగుల రక్షణే ప్రథమ కర్తవ్యంగా భావిస్తూ అంతర్గతంగా ట్రావెల్ అడ్వయిజరీ జారీచేసింది. ఉద్యోగులెవరూ ఇరాన్‌కు వెళ్లవద్దని, అక్కడ ఉన్నవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించింది. ఇరాన్ సంస్థలు లేదా ఆ దేశ వ్యక్తులతో ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష వ్యాపార లావాదేవీలు పెట్టుకోవద్దని కఠిన ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా కంపెనీ డేటా, నెట్‌వర్క్ భద్రతపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని డెల్ తన ఐటీ విభాగాలను హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అమెరికా-ఇరాన్ ఘర్షణ ఇప్పుడు క్షిపణుల నుంచి గ్లోబల్ టెక్నాలజీ, ఫైనాన్స్ సంస్థల వైపు మళ్లినట్టుగా కనిపిస్తోంది. అమెరికాకు చెందిన 18 ప్రముఖ కంపెనీలు తమ హిట్ లిస్టులో ఉన్నాయని ఐఆర్జీసీ తన టెలిగ్రామ్ ఛానల్ ద్వారా స్పష్టంచేసింది. ఈ ఐటీ సంస్థలన్నీ అమెరికా నిఘా వర్గాలకు సమాచారాన్ని చేరవేస్తున్నాయని ఆరోపించింది.

## క్రీడలతో శారీరక, మానసిక ధృఢత్వం : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఏప్రిల్ 04 : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. శనివారం ప్రగతి మైదానంలో గాయత్రి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల వల్ల శారీరకంగా, మానసికంగా ధృఢంగా తయారవుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందని యువతను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే క్రీడా మైదానాల అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను యువత ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. యువతతో కలిసి ఎంపీ మైదానంలో క్రికెట్ ఆడి ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, చుంచుపల్లి మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, బీఆర్ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు, కార్పొరేటర్లు సింధు తపస్వి, సాగర్, సర్పంచులు శ్రీకాంత్, జయరాం, నాయకులు శ్రీకాంత్, రమాకాంత్, బి.శ్రీనివాస్, కన్ని రాజేష్, మిట్టపల్లి కిరణ్ పాల్గొన్నారు.



# హర్మ్యూజ్‌ను తెరవడానికి 35 దేశాలు ప్రయత్నాలు..

## భారత్‌కు ఆహ్వానంపై స్పందించిన కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4, (న్యూస్ పల్స్)ఇరాన్‌తో తాము చేస్తున్న యుద్ధానికి మద్దతు ఇవ్వడం లేదని నాటో సహా మిత్ర దేశాలపై అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ కాలుగాలిన పిల్లిలా చిందులు వేస్తున్నారు. నాటో నుంచి అమెరికా వైదొలగుతుందని ఆయన బెదిరింపులకు దిగారు. బ్రిటన్ మాత్రం ఈ యుద్ధంతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఖరాఖండిగా చెప్పింది. అవసరమైతే హర్మ్యూజ్ తెరవడానికి దౌత్య మార్గాల్లో ప్రయత్నిస్తామని ప్రకటన చేసింది. దీంతో 35 దేశాలతో సమావేశం నిర్వహిస్తుండగా.. దీనికి భారత్‌ను ఆహ్వానించింది.పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దాదాపు మూసివేసిన హర్మ్యూజ్ జల సంధిని తెరిపించడానికి యూకే నాయకత్వంలోని 35 దేశాలు ఏర్పాటుచేసిన సమావేశానికి భారత్‌కు ఆహ్వానం అందినట్టు కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ఆ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ.. గురువారం జరగబోయే సమావేశంలో భారత్ తరఫున విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ వర్చువల్‌గా హాజరవుతారని ఆయన తెలిపారు. ' హర్మ్యూజ్ జల సంధి అంశంపై చర్చించేందుకు ఏర్పాటుచేసిన సమావేశానికి భారత్ సహా పలు దేశాలను యూకే ఆహ్వానించింది.. భారత తరఫున విదేశాంగ కార్యదర్శి హాజరవుతారు' అని జైస్వాల్ తెలిపారు.చమురు, ఎల్పీజీ, ఎల్ఎన్జీ సహా ఇంధనం మోసుకొచ్చే నౌకల సురక్షిత ప్రయాణం కోసం ఇరాన్, ఇతర దేశాలతో మేము సంప్రదింపులు జరుపుతున్నాం.. గత కొన్ని రోజులుగా జరిపిన చర్చల ఫలితంగా భారత్‌కు చెందిన ఆరు ట్యాంకర్లు హర్మ్యూజ్‌ను సురక్షితంగా దాటాయి.. నిరంతరం సంబంధిత పార్టీలతో సంప్రదింపులు కొనసాగిస్తున్నాం" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ప్రపంచ ఇంధన సరఫరాకు హర్మ్యూజ్ అత్యంత కీలకమైంది. దీని ద్వారానే ప్రపంచ ఐదో వంతు ఇంధనం సరఫరా అవుతుండగా.. భారత్ దిగుమతి చేసుకునే చమురులో 40 శాతం, ఎల్ఎన్జీలో 50 శాతం, ఎల్పీజీలో 80 శాతం హర్మ్యూజ్ నుంచే వస్తుంది.ఈ జలసంధిని తిరిగి తెరవడం తన కీలక ప్రాధాన్యతలలో ఒకటని చెబుతూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం మాట మార్చారు. యూకేతో సహా అమెరికా మిత్రదేశాలను వారి చమురును వారే సమకూర్చుకోవాలని కోరారు. ఇకపై అమెరికా వారికి సహాయం చేయదని ఆయన నొక్కి చెప్పారు. అమెరికాకు అండగా నిలవని దేశాలకు.. తాము కూడా సహాయం చేయబోమని పేర్కొన్నారు. యూకే వంటి దేశాలకు రెండే మార్గాలున్నాయని ఒకటి ఇంధనం పుష్కలంగా ఉన్న తమ నుంచి ఆయిల్ కొనాలని.. రెండు ధైర్యం ఉంటే హర్మ్యూజ్ దగ్గరకు వెళ్లి తెచ్చుకోవాలని బెదిరింపులకు దిగారు.

# మళ్లీ 3వ వారంలో పార్లమెంట్ సెషన్స్...

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (న్యూస్ పల్స్) కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు ఏప్రిల్ 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. 2023లో ఆమోదం పొందిన ఈ చట్టం.. కొత్త జనగణన, నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే అమల్లోకి వస్తుందని గతంలో పేర్కొన్నారు. అయితే, తాజా సవరణల ద్వారా ఈ నిబంధనలను సడలించి, 2029 సార్వత్రిక ఎన్నికల నాటికే 33 శాతం మహిళా కోటాను అమలు చేయాలన్నది ప్రభుత్వ ప్రధాన వ్యూహం.ఈ ప్రత్యేక సెషన్‌లో ప్రవేశపెట్టబోయే ప్రతిపాదనల్లో అత్యంత కీలకమైనది లోక్‌సభ స్థానాల పెంపు . ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 816కు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల పెరిగిన స్థానాల్లో సుమారు 273 సీట్లను మొత్తం స్థానాల్లో మూడో వంతు మహిళలకు కేటాయించే అవకాశం ఉంటుంది. ఇలా చేయడం వల్ల ప్రస్తుతం ఉన్న పురుష ఎంపీల ప్రాతినిధ్యానికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా, అదనపు స్థానాల ద్వారా మహిళా రిజర్వేషన్లను అమలు చేయవచ్చని కేంద్రం భావిస్తోంది. ఇదే తరహా మార్పులను రాష్ట్ర అసెంబ్లీల్లో కూడా ప్రవేశపెట్టనున్నారు. అమలు ప్రక్రియలో ఉన్న ప్రధాన అడ్డంకిని తొలగించేందుకు ప్రభుత్వం ఒక వినూత్న మార్గాన్ని ఎంచుకుంది. కొత్త జనగణన కోసం వేచి చూడకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు వీలుగా డీలిమిటేషన్ చట్టాన్ని సవరించనున్నారు. దీనివల్ల జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గకుండా, అన్ని రాష్ట్రాల్లోనూ దాదాపు 50 శాతం మేర సీట్లు పెరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఒక రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు సాధారణ బిల్లును కూడా సభలో ప్రవేశపెట్టనున్నారు. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలు, సందేహాలను నివృత్తి చేసేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే పలువురు విపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రభుత్వం ఈ హడావుడి చేస్తోందని కాంగ్రెస్ వంటి పార్టీలు విమర్శిస్తున్నప్పటికీ, మహిళా సాధికారత విషయంలో వెనక్కి తగ్గకూడదని కేంద్రం గట్టి పట్టుదలతో ఉంది. ఈ ప్రత్యేక సమావేశాలు విజయవంతమైతే, భారత పార్లమెంట్ చరిత్రలో మహిళల ప్రాతినిధ్యం అత్యున్నత స్థాయికి చేరుకోవడం ఖాయం.

# కాళేశ్వరం చుట్టూ రాజకీయం

హైదరాబాద్, ఏప్రిల్ 4, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు మళ్లీ 'కాళేశ్వరం' చుట్టూ తిరుగుతోంది. నిన్నటి వరకు కేవలం రాష్ట్రానికి పరిమితమైన ఈ వివాదం, ఇప్పుడు పార్లమెంట్ వేదికగా జాతీయ స్థాయి చర్చగా మారింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి నుంచి చేస్తున్న "కూలేశ్వరం" విమర్శలకు, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ రాజ్యసభలో ఇచ్చిన సమాధానం ఒక ఆయుధంలా మారింది. దీంతో అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ పకడ్బందీగా వేస్తున్న వ్యూహాల మధ్య బీఆర్ఎస్ ఆత్మరక్షణలో పడిపోయింది.రాజ్యసభలో అమరావతిపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు అడ్డుతగలడం వికటించింది. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ దీనిపై ఘాటుగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో దాదాపు లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయిందని కుండబద్దలు కొట్టారు. ప్లానింగ్, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని కేంద్రం అధికారికంగా ప్రకటించడం బీఆర్ఎస్‌కు చావుదెబ్బ వంటిది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏవైతే ఆరోపణలు చేస్తోందో, వాటన్నింటినీ కేంద్రం ధ్రువీకరించినట్లయింది.సాధారణంగా తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటాయి. కానీ, కాళేశ్వరం విషయంలో మాత్రం ఈ రెండు పార్టీల వాదన ఒకేలా ఉంది. కాళేశ్వరం ఒక అవినీతి తిమింగలమని, దీనివల్ల తెలంగాణకు ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువని రేవంత్ రెడ్డి వాదిస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం కాళేశ్వరాన్ని గత ప్రభుత్వం ఒక ఏటీఎం లాగా వాడుకుందని, కేవలం కమిషన్ల కోసమే రీ-డిజైనింగ్ పేరుతో వేల కోట్లు అదనంగా ఖర్చు చేశారని విమర్శించారు.

# మైనార్టీలే గెలుపు డిసైడ్...

తిరువనంతపురం, ఏప్రిల్4 (న్యూస్ పల్స్) కేరళ జనాభాలో ముస్లింలు సుమారు 26 శాతం, క్రైస్తవులు సుమారు 18 శాతం... కలిపి దాదాపు 45 శాతం పైగా ఉన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు తరచుగా హిందూ-ముస్లిం ధ్రువీకరణ చుట్టూ తిరుగుతుంటే, కేరళలో మాత్రం ఈ రెండు మైనారిటీ వర్గాల మొగ్గు ఎటువైపు ఉంటే ఆ కూటమి అధికార పీఠాన్ని అధిరోహిస్తుంది. దశాబ్దాలుగా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ కు ఈ వర్గాలే కొండంత అండగా ఉంటూ వస్తున్నాయి. ముఖ్యంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పార్టీలు కాంగ్రెస్ కూటమిలో ఉండటం వల్ల ముస్లిం ఓట్లు గంపగుత్తగా యూడీఎఫ్‌కే పడేవి.ఉత్తర కేరళలోని మలప్పురం , వయనాడ్ జిల్లాలు మైనారిటీ రాజకీయాలకు కేంద్రబిందువులు. మలప్పురంలో ముస్లిం జనాభా అధికంగా ఉండటంతో ఇక్కడ ముస్లిం లీగ్ తిరుగులేని శక్తిగా ఎదిగింది. అలాగే వయనాడ్ వంటి చోట్ల ముస్లిం, క్రైస్తవ ఓటర్ల కలయిక అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తుంది. ఈ జిల్లాల్లో మెజారిటీ స్థానాలను సాధించకుండా ఏ కూటమి కూడా తిరువనంతపురంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం అసాధ్యం. గత ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్ నుండి పోటీ చేయడం కూడా ఈ మైనారిటీ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని చేసిన వ్యూహమే. ప్రస్తుతం ప్రియాంకాగాంధీ వయనాడ్ ఎంపీగా ఉన్నారు. గతంలో మైనారిటీ ఓట్లు కేవలం కాంగ్రెస్ సొత్తని భావించేవారు, కానీ ఇటీవలి కాలంలో ఎల్డీఎఫ్ ఈ కోటలోకి చొచ్చుకెళ్లింది. మతతత్వ శక్తులను అడ్డుకోగల ఏకైక శక్తి కమ్యూనిస్టులేననే ప్రచారంతో ముస్లిం యువతను ఎల్డీఎఫ్ ఆకట్టుకుంది. అలాగే కేరళ కాంగ్రెస్ ఎం వంటి క్రైస్తవ ప్రాధాన్యత గల పార్టీని తమ కూటమిలోకి చేర్చుకోవడం ద్వారా మధ్య కేరళలోని క్రైస్తవ ఓటు బ్యాంకులో ఎల్డీఎఫ్ పట్టు సాధించింది. 2021లో ఎల్డీఎఫ్ వరుసగా రెండోసారి గెలవడానికి ఈ మైనారిటీ ఓట్ల చీలిక , మళ్లింపు ప్రధాన కారణం.ఒకప్పుడు కాంగ్రెస్‌కు వెన్నెముకలా ఉన్న క్రైస్తవ ఓటర్లలో ఇప్పుడు స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. చర్చిల్లో ఉన్న వివిధ వర్గాల మధ్య ఉన్న అంతర్గత సమస్యలు వారి ఓటింగ్ సరళిని ప్రభావితం చేస్తున్నాయి. జేకోబైట్ చర్చి వంటి వర్గాలు ఎల్డీఎఫ్‌కు మద్దతు తెలపడం యూడీఎఫ్‌కు గట్టి దెబ్బ.

అదే సమయంలో, బీజేపీ కూడా క్రైస్తవ నాయకులతో మంతనాలు జరుపుతూ వారిని తమ వైపు తిప్పుకోవడానికి మైనారిటీల మధ్య అనుమానతలు వంటి అంశాలను వాడుకుంటోంది.కేరళలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, మైనారిటీల ప్రయోజనాలను విస్మరించడం సాధ్యం కాదు. విద్యా సంస్థలు, మతపరమైన హక్కులు , సంక్షేమ పథకాల కేటాయింపులో ఈ వర్గాలకు ఇచ్చే ప్రాధాన్యతపైనే ఆయా పార్టీల మనుగడ ఆధారపడి ఉంటుంది. ముస్లిం లీగ్ వంటి పార్టీలు యూడీఎఫ్‌లో కింగ్ మేకర్లుగా వ్యవహరిస్తుంటే, ఎల్డీఎఫ్ తనదైన సోషల్ ఇంజనీరింగ్ ద్వారా మైనారిటీ మద్దతును కూడగడుతోంది. కేరళలో మైనారిటీ ఓటు అనేది కేవలం ఒక సంఖ్య కాదు, అది ఆ రాష్ట్ర రాజకీయ సుస్థిరతను నిర్దేశించే ఒక బలమైన శక్తి. రాబోయే ఎన్నికల్లో కూడా మలప్పురం నుండి కొట్టాయం వరకు ఈ వర్గాల మనసు గెలుచుకున్న వారే కేరళ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టిస్తారు.

# బెర్త్ కోసం వ్యూహాలు

హైదరాబాద్, ఏప్రిల్ 4, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి మంత్రివర్గ విస్తరణపైనే ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కారులో మార్పులు జరుగుతాయనే అంశంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రస్తుత పరిస్థితులు, పార్టీ వ్యూహాలను విశ్లేషిస్తే, ఈ విస్తరణ అంశం ఎందుకు ఆసక్తికరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.తెలంగాణ మంత్రివర్గంలో ప్రస్తుతం రెండు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. వాస్తవానికి, ఏప్రిల్ మొదటి వారంలోనే ఈ ఖాళీలను భర్తీ చేస్తారని, మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అందరూ భావించారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే ఈ ప్రక్రియ వేగవంతం అవుతుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే, తాజా పరిణామాల దృష్ట్యా ఈ విస్తరణ ప్రస్తుతానికి వాయిదా పడినట్లు తెలుస్తోంది.మంత్రివర్గ విస్తరణ వాయిదా పడటానికి ప్రధాన కారణం ఐదు రాష్ట్రాల ఎన్నికలేనని సమాచారం. ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ముఖ్యంగా కేరళలో అధికారంలోకి వస్తామనే ధీమాతో ఉన్న కాంగ్రెస్ అగ్రనాయకత్వం, అక్కడ ప్రచారంలో నిమగ్నమైంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు కూడా కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ఈ కీలక సమయంలో మంత్రివర్గ విస్తరణ వంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం వల్ల పార్టీ దృష్టి మళ్లుతుందని అధిష్టానం భావిస్తున్నట్లు కనిపిస్తోంది.కేవలం రెండు ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, మంత్రివర్గంలో పూర్తి స్థాయి ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యోచిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న మంత్రుల పనితీరును బేరీజు వేసి, అవసరమైతే ఒకరిద్దరిని తప్పించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రావాల్సి ఉంది. అయితే, ఈ మార్పుల వల్ల పార్టీలో అంతర్గత విభేదాలు లేదా అసంతృప్తి తలెత్తకుండా జాగ్రత్త పడాలని అధిష్టానం సూచించినట్లు సమాచారం.విస్తరణ వార్తలతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పదవి దక్కుతుందని ఆశపడ్డ నాయకులు విస్తరణ వాయిదా పడటంతో కొంత నిరాశకు గురైనప్పటికీ, తమ ప్రయత్నాలను మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారు. కొందరిలో రిలాక్స్ కనిపిస్తుంటే, మరికొందరిలో టెన్షన్ పెరుగుతోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాతే తెలంగాణలో కేబినెట్ విస్తరణపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.మొత్తానికి, తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అనుసరిస్తున్న ఎన్నికల వ్యూహాలతో ముడిపడి ఉంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల సందడి ముగిసిన తర్వాతే రేవంత్ రెడ్డి తన టీమ్ లో ఎవరికి చోటు కల్పిస్తారు, ఎవరిని మారుస్తారనేది స్పష్టమవుతుంది. అప్పటి వరకు ఆశావహులు వేచి చూడక తప్పని పరిస్థితి నెలకొంది.

# టీఆర్ఎస్ పేరు వాడేసుకుంటారా

హైదరాబాద్, ఏప్రిల్ 4, (న్యూస్ పల్స్)టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్రసమితి).. ఒకప్పుడు గ్రామ గ్రామాన నినదించిన పేరు.. వినిపించిన పేరు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు.. కూడా టీఆర్ ఎస్ తెలంగాణ పల్లె నుంచి పట్నం వరకు ప్రజల నరాల్లో జీర్ణించుకుపోయింది. పూర్తిస్థాయి పేరు పలకడం రాని వారు కూడా 'టీఆర్ఎస్' జపం చేసిన రోజులు ఇంకా గుర్తుండే ఉన్నాయి. టీఆర్ ఎస్ అధినేత కేసీఆర్.. అధికారంలోకి వచ్చిన ఏడు సంవత్సరాల వరకు టీఆర్ ఎస్ పార్టీనే ఉంది. ఆ తర్వాత.. దానిని బీఆర్ ఎస్‌గా మార్పు చేశారు. .. ఇప్పుడు ఈ 'టీఆర్ ఎస్' పేరును వినియోగించుకునే దిశగా కేసీఆర్ తనయ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అడుగులు వేస్తున్నారా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. ప్రస్తుతం టీఆర్ ఎస్ ఖాళీగా ఉందని.. దానిని ఎవరూ వినియోగించుకోవడం లేదని.. దీనిని ఎవరైనా వినియోగించుకునే సౌకర్యం ఉందని కవిత వ్యాఖ్యానించారు. దీనిని బట్టి.. ఆమెస్థాపించ బోయే కొత్త పార్టీకి ఈ పేరు పెట్టినా ఆశ్చర్యంలేదన్న వాదన వినిపిస్తోంది వాస్తవానికి కొన్ని రోజుల కిందట.. కవిత.. తన పార్టీ పేరును తెలంగాణ 'జాగృతి'గానే పేర్కొన్నారు. ఈ పేరునే కేంద్ర ఎన్నికల సంఘంలో నమోదు చేసేందుకు ఇచ్చినట్టు ప్రచారం కూడాఉంది. కానీ, ఇంత లోనే ఆమె తనదైన శైలిలో వ్యూహం మార్చినట్టు తెలుస్తోంది. తెలంగాణ జాగృతి కంటే.. 'టీఆర్ఎస్' పేరు ఇప్పటికే ప్రజలకు చేరువైన నేపథ్యంలో ప్రజల నాలుకలపై ఒకప్పుడు పెద్ద ఎత్తున కదలాడిన పేరు కూడా కావడంతో ఆ పేరునే ఆమె ఓన్ చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ విషయాన్ని నర్మగర్భంగా చెప్పుకొచ్చిన కవిత.. "పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తా" అని వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ పేరు ఫ్రీ అయిందని అన్నారు. ఈ పేరును ఇప్పుడు ఎవరైనా వాడుకోవచ్చని వ్యాఖ్యానించారు. అయితే.. తాను తీసుకుంటున్నట్టుగా ఆమె స్పష్టం చేయలేదు. ఇదిలావుంటే.. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని కవిత వెల్లడించారు.

# రాములమ్మ శాపనార్థాలు

హైదరాబాద్, ఏప్రిల్ 4, (న్యూస్ పల్స్)కాంగ్రెస్ పార్టీ నాయకురాలు.. ఎమ్మెల్సీ విజయశాంతి.. ఉరఫ్ రాములమ్మ.. ఇటీవల మండలి సమావేశాల్లో చివరి రోజు పెద్ద ఎత్తున మాట్లాడిన విషయం తెలిసిందే. తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకున్న వారికి న్యాయం చేయాలని.. లేక పోతే.. కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర హీనంగా మిగిలిపోతుందని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. 25 వేల రూపాయల పింఛను, ఉద్యోగాలు, భూములు ఇవ్వాలని కూడా సూచించారు. దీనిపై వేసిన కమిటీ కాలయాపన కమిటీగా ఉందన్నారు. ఉద్యమ కారుల తరఫున విజయశాంతి మండలిలో పలు వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంపై( బీ ఆర్ ఎస్)పైనా విమర్శలు చేసినా.. అవి సునిశితంగా సున్నితంగా ఉన్నాయన్న వాదన వినిపించింది. ఇక, ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీలో గుసగుస మొదలైంది. ఆమె లేవనెత్తిన అంశాలపై ఎవరూ విభేదిం చకపోయినా.. ఆమె తీరును మాత్రం కొందరు తప్పుబడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా.. బీఆర్ ఎస్ వంటి ప్రత్యర్థి పార్టీలకు ఊతమిచ్చేలా ఆమె వ్యాఖ్యానించారని ఓ మంత్రి ఆఫ్ దిరికార్డుగా అన్నారు. ఇదే మాట మరికొందరు కూడా చెబుతున్నారు. గతంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు.. విజయశాం తి ప్రకటనలకే పరిమితం అయ్యారని అప్పట్లో ఎందుకు ప్రశ్నించలేదని వ్యాఖ్యానించడం గమనార్హం. అంతేకాదు.. ఇప్పుడు సొంత పార్టీ ప్రభుత్వం ఎన్నో అమలు చేస్తోందని.. కానీ, విజయశాంతికి అవేవీ కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం పింఛన్లు ఇస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. కానీ.. విజయశాంతి ప్రత్యేక ఎజెండా పెట్టుకుని మాట్లాడారని.. ఒక వర్గాన్ని రెచ్చగొట్టే ధోరణి కనిపించిందని మెజారిటీ నాయకులు వ్యాఖ్యానించారు. . కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నప్పటికీ.. రాములమ్మ ప్రత్యేక శైలిని అవలంభిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రస్థాయి నాయకుల కంటే కూడా ఆమె జాతీయ స్థాయి నాయకులతోనే ఎక్కువగా టచ్‌లో ఉంటున్నారు. అంతేకాదు.. రాష్ట్ర ప్రభుత్వ పనిలోనూ ఆమె భాగస్వామ్యం తక్కువగానే ఉంది. కొన్ని కొన్నిసందర్భాల్లో అసలు లేనే లేదన్న వాదన కూడా ఉంది. ఈ నేపథ్యంలోనే గత రెండు రోజులుగా విజయశాంతి వ్యవహారంపై పార్టీలో చర్చసాగుతోంది.రేసులో మహేశ్ గౌడ్, విజయశాంతి, రాజగోపాల్..రెండు బెర్తులనే ఫిలప్ చేస్తే..ఆశావహులను ఎలా సంతృప్తి పరుస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి అమాత్య యోగం కోసం గట్టి పట్టుబడుతున్నారు. ఇక బీసీ వర్గం నుంచి కూడా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పేరు ప్రధానంగా చర్చకు వస్తున్నా..విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, బీర్ల అయిలయ్య వంటి వారు పోటీ పడుతున్నారు. విజయశాంతి పేరు కూడా రేసులో ప్రధానంగా వినిపిస్తోంది. అయితే రెండు బెర్తుల కోసం అరడజను మంది ఆశావహులు సీరియస్‌గా ట్రై చేస్తుండటంతో ఎవరికి అవకాశం కల్పిస్తారనే ఉత్కంఠ కంటిన్యూ అవుతోంది.ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులపై అటు రాములమ్మకు..ఇటు రాజన్న బోలెడు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఈ ఇద్దరిది స్పెషల్ కాంబినేషన్. మనుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ విజయశాంతి. ఈ ఇద్దరి కల, ఆశ



ఒకటే. అదే క్యాబినెట్ మినిస్టర్. అయితే అమాత్య యోగం కోసం వెయిటింగ్‌లో ఉన్న వీళ్లిద్దరు..తమకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారు. ఈ క్రమంలోనే సమయం సందర్భం దొరికినప్పుడల్లా సొంత ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా కామెంట్స్ చేస్తున్నారు.ఈ మధ్యే అటు మండలిలో రాములమ్మ, ఇటు అసెంబ్లీ రాజగోపాల్‌రెడ్డి చేసిన కామెంట్స్ అధికార కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేశాయన్న చర్చ నడుస్తోంది. వారి అసంతృప్తి చల్లార్చేందుకు హస్తం పార్టీ పెద్దలు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. రాజగోపాల్‌రెడ్డికి అధిష్టానమే హామీ ఇచ్చి ఉండటంతో ఆయనకు బెర్త్ పక్కా అంటున్నారు. ఇక లేడీ ఫైర్ బ్రాండ్‌గా..బీఆర్ఎస్‌పై బాణాలు ఎక్కు పెట్టాలంటే రాములమ్మకు మంత్రివర్గంలోకి తీసుకుంటే బాగుంటుందన్న చర్చ జరుగుతోందట.ఇప్పటికే రెండున్నరేళ్ల పాలన పూర్తి కావొస్తోంది. ఎన్నికలకు ఇంకో రెండున్నరేళ్లే ఉన్నట్లు. ఈ అంశాన్ని దృష్టిలో క్యాబినెట్‌లో ఖాళీగా ఉన్న రెండు బెర్తుల భర్తీపై ఫోకస్ పెట్టింది. అయితే విప్‌లుగా పని చేస్తున్న వారు ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో ఇద్దరికి ప్రమోషన్ దక్కగా..మరో ఇద్దరు కూడా అమాత్య యోగం కోసం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య ఇద్దరు కూడా మంత్రివర్గంలో ఛాన్స్ కోసం ఆశలు పెట్టుకున్నారు. మున్నూరుకాపు సామాజిక వర్గం నుంచి ఆది శ్రీనివాస్..యాదవ సామాజిక వర్గం నుంచి బీర్ల అయిలయ్య తనకు క్యాబినెట్‌లో చోటు కల్పించాలని కోరుతున్నారు. అయితే విస్తరణకే పరిమితం అయితే మాత్రం ఈ ఇద్దరి ఆశలు నెరవేరుతాయో లేదోనన్న డైలమా కంటిన్యూ అవుతోంది. క్యాబినెట్ విస్తరణతో పాటు షఫ్లింగ్ చేస్తే మాత్రం ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్యకు ప్రమోషన్ దక్కే చాన్సెస్ ఎక్కువగా ఉన్నాయంటున్నారు. అదే జరిగితే ఇప్పటికే క్యాబినెట్‌లో ఉన్నవారిలో ఎవరికి ఉద్వాసన పలుకుతారన్నది మరో చర్చ. క్యాబినెట్ ఎక్స్‌ప్యాన్షన్‌తోనే సరిపెడుతారా? లేక ప్రక్షాళన చేస్తారా అనేది చూడాలి.

# బీబీనగర్ పీహెచ్‌సీలో కిశోర బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్

బీబీనగర్, ఏప్రిల్ 4 : బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 14 సంవత్సరాల కిశోర బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిశోర బాలికల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. 14 సంవత్సరాల వయస్సులో ఈ టీకా వేయించుకోవడం ద్వారా భవిష్యత్‌లో గర్భాశయ క్యాన్సర్



ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు. అర్హత కలిగిన ప్రతి బాలిక ఈ టీకాను తప్పనిసరిగా తీసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను టీకా కార్యక్రమానికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని, సూపర్‌వైజర్లు శాంతాకుమారి, ప్రభాకర్, ఎంపీహెచ్‌ఏ వసంత, కవిత, డీఈఓ శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు సూర్య దేవాలయంలో సంకష్టహర చతుర్థి ప్రదోష పూజ...

విభారే న్యూస్ ఏప్రిల్ 04 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో వరసిద్ధి వినాయక స్వామి వారికి సంకష్టహర చతుర్థిప్రదోష పూజ 05/04/2026, ఆదివారము నాడు నిర్వహించబడును.వరసిద్ధి వినాయక స్వామి వారిని పూజిస్తే అనుకున్న పనులు వెంటనే జరుగుతాయి ఏ కార్యం తలపెట్టిన విఘ్నాలు రావు



మరియు మీ జాతకం లో బుధ,కేతు గ్రహాలు కలిగించు ఆటంకాలు తొలగిపోయి శుభ ఫలితాలను ప్రసాదించును. అటువంటి స్వామి వారికి ఈ రోజున ఉదయం 10:30 గం''లకు లక్ష్మీ గణపతి మూల మంత్ర సహిత లక్ష్మీ గణపతి హోమం జరుగును. సాయంకాలము 6:00 గంటలకు పంచామృత అభిషేకం,సంకష్టహర చతుర్థి ప్రదోష పూజ జరుగును. ఇందు భక్తులు విశేషముగా పాల్గొని శుభ ఫలితాలు పొందగలరు. సమయపాలన పాటించగలరని మనవి.సంకటహర చతుర్థి ప్రదోష పూజ 200 /-హోమ సంకల్పం 116 /- విశేషంగా ప్రధాన హోమం 2500/-వివరములకు సంప్రదించవలసిన నెం:-జి. ప్రద్యుమ్న కుమార్ శర్మ9440616198 ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777..

## రాయలసీమలో హార్టికల్చర్ హబ్--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 04:-రాయలసీమలో హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి సుమారు రూ.40 వేల కోట్లతో భారీ ప్రణాళిక రూపొందించామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శనివారం నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన బడ్జెట్ అవుట్‌రీచ్ 2026-27 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.బడ్జెట్‌పై ప్రజల్లో అవగాహన పెంపే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, టెక్నాలజీ సహాయంతో బడ్జెట్ ప్రక్రియను సరళీకరించామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నదైనా, ఆదాయ వనరుల పెంపు, ఆర్థిక క్రమశిక్షణతో మెరుగుదల సాధిస్తున్నామని పేర్కొన్నారు.రాష్ట్ర రాబడిలో అధిక భాగం జీతాలు, పెన్షన్లకే వెళ్తోందని, ఆర్థిక ఒత్తిడి ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యం పాటిస్తున్నామని చెప్పారు. కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్స్ ద్వారా ఆదాయం పెంచడంపై దృష్టి పెట్టామని తెలిపారు.మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారులు, నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నామని, జిల్లాల స్థాయిలో బడ్జెట్ సంస్కరణలు అమలు చేస్తామని చెప్పారు. పారదర్శకతతో ప్రజలకు ఉపయోగపడే విధంగా పాలన కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి గణియా, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం--

### శిరివెళ్లలో దానధర్మా ట్రస్ట్ సేవలు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 04-శిరివెళ్ల మండల కేంద్రంలోని 40వ జాతీయ రహదారి ప్రక్కన శిరివెళ్ల మెట్ట వద్ద దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం శుద్ధజల చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఏ. నాగమల్లేశ్వర రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే



నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఏర్పాటు చేయడం వల్ల గోస్పాడు, సిరివెళ్ల, దొర్నిపాడు, రుద్రవరం మండలాలకు వెళ్లే ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.మండల కార్యాలయాలకు వచ్చే ప్రజలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నెం నాగేశ్వర రెడ్డి, అన్నెం సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్‌పై అపోహలు వద్దు---

### సరఫరా సజావుగా కొనసాగుతోంది--

### అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 04:అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు శనివారం తాసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ల కొరతపై వ్యాపిస్తున్న వదంతులను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో వినియోగదారులకు సరిపడా గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.గ్యాస్ సిలిండర్ల కోసం గ్యాస్ ఏజెన్సీల వద్దకు వినియోగదారులు రావాల్సిన అవసరం లేదని, సిలిండర్లు నేరుగా వారి ఇళ్లకే సరఫరా చేస్తున్నామని వివరించారు. ఏజెన్సీల వద్ద గుంపులు గుమికూడకుండా ఉండాలని సూచించారు.అలాగే గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఉయ్యాలవాడ పీహెచ్‌సీలో సిబ్బంది నిర్లక్ష్యం--

### అత్యవసర సమయంలో వైద్య సిబ్బంది గైర్హాజరు--

### ప్రజల ఆగ్రహం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 04-ఉయ్యాలవాడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సిబ్బంది నిర్లక్ష్యం బయటపడింది. శనివారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఉయ్యాలవాడ మారమ్మ గుడి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని అత్యవసర చికిత్స కోసం పీహెచ్‌సీకి తరలించగా, అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆందోళనకు గురి చేసింది.అత్యవసర పరిస్థితుల్లో కూడా సిబ్బంది లేకపోవడంతో బాధితులకు సమయానికి చికిత్స అందడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాముకాట్లు, రోడ్డు ప్రమాదాలు వంటి అత్యవసర కేసులు వచ్చినప్పటికీ, ప్రాథమిక చికిత్స అందించడానికి సిబ్బంది అందుబాటులో ఉండకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.ఇప్పటికే పలుమార్లు ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ, సంబంధిత అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, పీహెచ్‌సీలో సిబ్బంది విధి నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలని, అత్యవసర సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## రాజధాని మహానగరంగా రూపుదిద్దుకోవాలనే వై.ఎస్. జగన్ "మావిగన్" ప్రతిపాదన.

### మావిగన్ పై చర్చించకుండానే వై.ఎస్. జగన్ పై కాలకూట విషం చిమ్ముతున్నారు

### . అమరావతిని రెండేళ్ళలో పూర్తి చేస్తామన్నారు...

### మళ్లీ నిరంతర ప్రక్రియ అంటున్నారు

### .వై.ఎస్. జగన్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విదంగా సోషల్ మీడియాతో చంద్రబాబు వ్యూహం

### .కూటమి నేతలు... చంద్రబాబుపై వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి, రెడ్యం ఫైర్.

కడప ,ఆంధ్రప్రదేశ్ రాజధాని మహానగరంగా రూపుదిద్దుకోవాలని, మహా నగరాలతో పోటీ పడాలని, తక్కువ ఖర్చుతో అతివేగంగా అభి వృద్ధి చెందాలని వైయస్సార్ సీపీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి "మావిగన్" ప్రతిపాధన చేస్తే దానిపై నారా చంద్రబాబునాయుడు సర్కార్ సాద్యా సాధ్యాలపై కనీసం చర్చించకుండా వైయస్ జగన్ పై కూటమి నేతలు, చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్, లోకేష్ లు నీఛ పదజాలంలో ఉచ్చనీచాలు మరచి కాలకూట విషం చిమ్మడం వారి నీచ రాజకీయానికి పరాకాష్ట అని వైయస్సార్ సిపీ రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నిమోజకవర్గ పరిశీలకుడు రెడ్యనీ వెంకటసుబ్బారెడ్డి ఫైర్ అయ్యారు. కడప నగరంలోని వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యాలయంలో శనివారం రెడ్యనీ వివేకరులతో మాట్లాడుతూ...కనీస మౌలిక సదుపాయాలు,వసతులు లేని 29 గ్రామాల పరిదిలోని రాజదాని అమరావతి పేరుతో ఎకరాకు రూ.రెండు కోట్లు చొప్పున రూ.రెండులక్షల కోట్లు కేవలం నీరు, డ్రైనేజీ, విద్యుత్ కోసమే ఖర్చు చేస్తే, పూర్తి స్థాయిలో అమరావతి నీ నిర్మించడం ఎలాంటి పరిస్థితుల్లో సాధ్యం కానే కాదని ...అందులో 10 శాతం ఖర్చుతో బెంగళూరు, హైదరాబాదు,చెన్నై లాంటి మహానగరాలతో పోటీ పడేవిదంగా మచిలీపట్నం, విజయవాడ-గుంటూరు తో కూడిన మావిగన్ 110కి.మీ కారిడార్ ను రాజధాని ప్రాంతంగా ప్రకటించాలంటూ వై.ఎస్. జగన్ ఆచరణాత్మక ప్రతిపాధన చేస్తే... "తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు" అన్నచందాన కనీసం చర్చించకుండా వై.ఎస్.జగన్ పై విషం చిమ్మడం రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడం లాంటిదే అని ఆయన వివరించారు. అమరావతిని 2028 కల్లా రెండేళ్ళలో పూర్తి చేసి ప్రధాని నరేంద్రమోది తో అమరావతిని ప్రారంభించి తీరుతానని బీరాలు పలికిన చంద్రబాబు నాయుడు తగుదునమ్మా అంటూ తన సహజ రీతిలో మాట మారుస్తూ ఇది నిరంతర ప్రక్రియ అంటూ ఒక్కరోజులోనే మాట మార్చడం తో ఊసరివెల్లులే సిగ్గుపడుతున్నాయని ఆమన ఎద్దేవా చేశారు. ఇప్పటికే భారతదేశంలో అత్యంత ఎక్కువ అప్పులు చేసిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టించిందని... ఈ పరిస్థితుల్లో లక్షల కోట్లు ఖర్చు చేసి,అప్పు లు చేసి రాజధానిని నిర్మించడమంటె రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచడమేనని ఆయన విమర్శించారు.వైయస్ జగన్ దూరదృష్టితో,తన అనుభవాన్ని రంగరించి, మేధావులతో చర్చించి రాష్ట్ర అభివృద్దికోసం మావిగన్ ప్రతిపాదన చేస్తే దానిపై విషప్రచారం చేయడం, వైయస్ జగన్ వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేవిదంగా టి.డి.పి సోషల్ మీడియా ప్రతినిదులతో చంద్రబాబు సమావేశం పెట్టి, వారికి ప్యాకేజీ ప్రకటించి,వారిని రెచ్చగొట్టడంలాంటి ప్రతిపాదనలతో వ్యూహం రచించడం ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులకు తగునా అంటూ ఆయన విరుచుకపడ్డారు. మావిగన్ ప్రతిపాధన రాష్ట్రంలో సంచలనంగా మారడంతో, చర్చలకు దారి తీయడంతో దిక్కుతోచని కూటమి నేతలంతా ఒక్కటై వై.ఎస్. జగన్ పై వ్యక్తిగత విమర్శలతో,నీచ పథజాలంతో విమర్శలు చేయడం, విరుచుకపడడం ఏమిటని? ఆయన సూటిగా ప్రశ్నించారు. అమరావతి పేరుతో రాజధాని ఉండడంతో దానిని దేవతలరాజుధాని గా కూటమి నేతలు ప్రచారం చేస్తున్నారని... మరి మృత్యుంజయుడు అని పేరుంటే ఆ వ్యక్తికి మరణం ఉండదా? అని ఆయన చలోక్తి విసిరారు. వైఎస్. జగనపై విమర్శలతో కాలం వెళ్ళబుచ్చుతూ,ఆచరణ సాధ్యం కాని అమరావతిని పట్టుకుని దానిని గొప్పదిగా చెప్పుకుంటూ భ్రమలు కల్పిస్తే రాష్ట్ర ప్రజల దృష్టిలో కూటమి నేతలు చరిత్రహీనులు కాక తప్పదని రెడ్యనీ తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపీ నేతలు... వైయస్సార్ సిపీ బి.సి. విభాగం జిల్లా కార్యదర్శి బత్తల సుబ్బరాముడు యాదవ్, ఆర్ట్స్ కాలేజీ మాజీ చైర్మన్ మద్దిక నాగేశ్వరరెడ్డి, గోటూరు ఎంపీటీసి సోమల రామకృష్ణారెడ్డి, ఉమ్మిదిశెట్టి చందు,గవిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, గంగిరెడ్డి సుదర్శన్ రెడ్డి లు పాల్గొన్నారు.

## టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు వ్యవహారశైలిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం

నంద్యాల ,టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు వ్యవహారశైలిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరుమల శ్రీవారి పవిత్రతను దెబ్బతీసే విధంగా అశ్లీల, అసభ్యకర చర్యలకు పాల్పడుతున్న బి.ఆర్. నాయుడును వెంటనే పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ, నంద్యాల పట్టణంలోని గుడిపాడి గడ్డ ప్రాంతంలో ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో వైసీపీ నేతలు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాష మాట్లాడుతూ, "శ్రీవారి పవిత్రతను కాపాడాల్సిన అత్యున్నత బాధ్యతలో ఉండి, అశ్లీల కార్యక్రమాలకు పాల్పడటం అత్యంత సిగ్గుచేటు. ఇది కేవలం ఒక వ్యక్తి తప్పిదం మాత్రమే కాదు ? టీటీడీ ప్రతిష్ఠకు మచ్చ" అని తీవ్రంగా విమర్శించారు. బి.ఆర్. నాయుడు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.నంద్యాల వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దల్ మిల్ అమీర్,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మాబునిషా,వైసీపీ జిల్లా మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, నంద్యాల జిల్లా వైసిపి అధికార ప్రతినిధి అనిల్ అమృత రాజ్, నంద్యాల జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, వైసీపీ జిల్లా కార్యదర్శులు దేవ నగర్ బాషా

## బుక్కాపురం స్పెషల్ ఆఫీసర్‌కు అభినందనలు---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 04-మహానంది మండలం బుక్కాపురం గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఎంపీడీవో సంజీవ్ కుమార్‌ను కూటమి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్యం, ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేయాలని కోరారు.జనసేన పార్టీ నాయకులు కాకర్ల శివ, వడ్డే శీను, టీడీపీ నాయకుడు మా రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటానని స్పెషల్ ఆఫీసర్ సంజీవ్ కుమార్ తెలిపారు.

## భూగర్భజలాల పెంపుకు 100 రోజుల డ్రైవ్--

### జలధారతో నీటి భద్రతపై దృష్టి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 04:-జిల్లాలో భూగర్భజలాల స్థాయిని పెంచేందుకు "జలధార" కార్యక్రమాన్ని 100 రోజుల ప్రత్యేక డ్రైవ్‌గా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఏప్రిల్ 6 నుంచి జూలై 14 వరకు కార్యక్రమం కొనసాగుతుందని, శాస్త్రీయ మ్యాపింగ్ ద్వారా నీటి వనరులను గుర్తించి వర్షపు నీటి నిల్వ, రీఛార్జ్ పనులు చేపట్టాలని సూచించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో కమిటీలను ఏర్పాటు చేసి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు.జిల్లాలోని 261 సాగునీటి సంఘాల ద్వారా నీటి వినియోగం, నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని పేర్కొన్నారు. చెక్‌డ్యామ్‌లు, పర్కొలేషన్ ట్యాంకులు, ఫార్మ్ పాండ్స్ వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ చర్యలు, పశువులకు నీటి అందుబాటు పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు.

## శానిటేషన్ పనులపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 04-నంద్యాల పట్టణంలో శానిటేషన్ పనుల అమలుపై మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న శనివారం ఆకస్మికంగా పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన రహదారులు, కాలనీలు, చెత్త సేకరణ కేంద్రాలు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించి శుభ్రత పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు.శానిటేషన్ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం మున్సిపాలిటీ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. చెత్త సకాలంలో సేకరణ, డ్రైనేజీ శుభ్రత, దోమల నివారణ చర్యలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.పనితీరులో లోపాలు కనిపించిన చోట బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుభ్రత విషయంలో ఎలాంటి అలసత్వం లేకుండా ప్రతిరోజూ పర్యవేక్షణ కొనసాగించాలని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీల్లో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్వైజర్లు లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బి.ఆర్ నాయుడు తొలగించాలి:: వైసీపీ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 04-టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడు వ్యవహారశైలిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ నడిగడ్డలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద నిరసన చేపట్టారు.శ్రీవారి పవిత్రతను కాపాడాల్సిన పదవిలో ఉండి అనుచితంగా ప్రవర్తించడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ ఇసాక్ బాష విమర్శించారు. బి.ఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ఆయనను వెనకేసుకొస్తున్న ప్రభుత్వ వైఖరిని ఖండించారు.తప్పులను ప్రశ్నిస్తున్న వారిపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమని నేతలు పేర్కొన్నారు. చైర్మన్‌ను వెంటనే తొలగించి తిరుమల పవిత్రతను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ నిరసనలో శశికళ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, అమీర్, మాబునిషా తదితరులు పాల్గొన్నారు.

## స్వాతి నక్షత్రం వేడుకలు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 4: శ్రీ ఘణ మద్దులేటి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం, తెలుగుపేటలో స్వాతి నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి కావడంతో అర్చకులు మూలమూర్తి శ్రీ మద్దులేటి లక్ష్మీ నృసింహస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు.అభిషేకం అనంతరం స్వాతి నక్షత్రం పూజాదాతల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి నిర్వహించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**